వర్షాలతో తాగునీటికి ఊరట

గోస్తనీ నదిలో ఊటబావుల వద్ద సమృద్ధిగా జలాలు



పద్మనాభం మండలం సామియ్యవలస వద్ద గోస్తనీనదిలో నీరు

తగరపువలస: భీమిలి జోన్ ప్రజలకు తాగునీటి సరఫరాలో ప్రధాన వనరు అయిన గోస్తనీనదిలో సరిపడినన్ని నీటి నిల్వలు ఉండటం ఈ వేసవికి ఊరట కలిగించినట్టయింది. జోన్‌లో సుమారు 75 వేల మంది ప్రజల తాగునీటి అవసరాలకు పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ సామియ్యవలస, భీమిలి మండలం టి.నగరపాలెం వద్ద ఉన్న గోస్తనీనదిలోని ఊటబావుల నుంచి నీటిని సేకరిస్తుంటారు. సాధారణంగా వేసవిలో వచ్చే ఏప్రిల్, మే నెలలో విపరీతమైన ఎండల కారణంగా ఈ రెండు చోట్లా నదిలో నీటి వనరులు అడుగంటిపోతుంటాయి. దీంతో ప్రత్యామ్నాయంగా టాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు రూ.లక్షలు వెచ్చించాల్సి వచ్చేది. మార్చి నెలలో కురిసిన వర్షాల కారణంగా నదిలో ఊటబావులు ఉన్న రెండుచోట్లా నీటి వనరులు ఉండటంతోపాటు ఈ ప్రాంతంలో భూమి తడిగా ఉంది. అలాగే ఏప్రిల్‌లో కూడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతుండడంతో ఈ ఏడాది తాగునీటి కష్టాల నుంచి బయటపడే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న నీటి వనరులు సముద్రంలో కలిసిపోకుండా ఉండేందుకు సామియ్యవలస వద్ద ఇసుక బస్తాలతో గట్టు ఏర్పాటు చేయాల్సి ఉంది.

వైఎస్సార్ ముందుచూపుతో..

2008వ సంవత్సరం ముందు వరకు భీమిలి మున్సిపాల్టీ ప్రజలను వేసవిలో తాగునీటి కష్టాలు వెంటాడేవి. మార్చి నెల మొదలుకుని జూలైలో వర్షాలు ప్రారంభమయ్యే వరకు గోస్తనీనది ఎండిపోయి ఇసుక తేలిపోయేది. దీనికితోడు చుట్టుపక్కల గ్రామ పంచాయతీలు, దివీస్ లేబొరేటరీ ఎడాపెడా నీటిని తోడేసేవి. దీంతో ఈ నాలుగు మాసాలు మున్సిపాల్టీలో ప్రజలు తాగునీటి కోసం అష్టకష్టాలు పడేవారు. 2004 ఎన్నికల్లో తొలిసారి ముఖ్యమంత్రి అయిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2005లో నగరబాట పేరుతో భీమిలిలో పర్యటించారు. అప్పట్లో భీమిలి మున్సిపాల్టీని పట్టిపీడిస్తున్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.10.50 కోట్లతో డీశాలినేషన్ ప్లాంట్ మంజూరు చేశారు. తర్వాత దీనికోసం విచారణ చేయగా నిర్వహణ కష్టమని మున్సిపాల్టీ చేతులు ఎత్తేయడంతో ఇప్పుడున్న సామియ్యవలస వద్ద తాగునీటి ప్లాంట్‌కు రూ.13 కోట్లు మంజూరు చేశారు. ఈ పథకం ఆయన మరణానంతరం భీమిలి ప్రజలకు అందుబాటులోకి వచ్చి వేసవిలో దాహాన్ని దాదాపు లేకుండా ఆదుకుంటుంది.

తాగునీటి కష్టాలు తీర్చారు



పెరిగిన జనాభాకు అనుగుణంగా భీమిలి మున్సిపాల్టీలో ఏడాది పొడవునా తాగునీటి అవసరాలు అధికారులు తీర్చలేకపోయేవారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా భీమిలి వచ్చినప్పుడు సామియ్యవలస వద్ద మంజూరు చేసిన తాగునీటి పథకమే ఇప్పుడు ఇక్కడి ప్రజలను ఆదుకుంటోంది. ప్రస్తుతం పైప్‌లైన్లు పగిలిపోవడంతో నీరు ఎర్రగా ఉండడం తప్ప తాగునీటి సరఫరాలో సమస్యలు లేవు.

– పాకలపాటి కళావతి, సంతపేట

కోర్టు జోక్యం చేసుకున్నా కొలిక్కిరాని వివాదం

- సాంఘిక సంక్షేమ శాఖ బాలుర కళాశాలలో జేడీ, వార్డెన్ మధ్య వార్



తాళాలు వేసి ఉన్న హాస్టల్ కార్యాలయ గది

తగరపువలస: స్థానిక బైపాస్‌రోడ్డులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర కళాశాలలో ఆ శాఖకు చెందిన జాయింట్ డైరెక్టర్ డీవీ రమణమూర్తి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి కె.నాగార్జున మధ్య వివాదం హైకోర్టు జోక్యం చేసుకున్నా ఇంకా సమసిపోలేదు. అసలే హాస్టల్ వెల్ఫేర్ అధికారుల కొరత కారణంగా ఇన్‌చార్జ్‌లపై పని ఒత్తిడితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జేడీపై విడుదలైన ఒక కరపత్రం... తానే విడుదల చేసినట్టు అనుమానంతో కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరి 16న వసతిగృహంలో తనిఖీలు చేపట్టి, 17న సస్పెండ్ చేసినట్టు వార్డెన్ నాగార్జున ఆరోపించారు. నోటీసు ఇవ్వకుండా సస్పెండ్ చేయడంతో నాగార్జున హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జేడీ ఆర్డర్‌ను నిలిపివేస్తూ ఆరువారాల్లో నాగార్జునను అదే హాస్టల్‌లో కొనసాగించాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులు, రీ జాయినింగ్ రిపోర్టును కలెక్టర్ కార్యాలయ సిబ్బంది జేడీ కార్యాలయంలో సమర్పించినా నాగార్జునను ఇప్పటి వరకు విధుల్లోకి తీసుకోలేదు. హాస్టల్‌లో విధులకు హాజరుకావడానికి వెళ్లిన నాగార్జునను ఫేస్ యాప్ నుంచి తొలగించడమే కాకుండా ఇన్‌చార్జి వార్డెన్ సత్యనారాయణ స్టోర్‌రూం తాళాలు ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో మరోసారి హైకోర్టును ఆశ్రయించనున్నట్టు వార్డెన్ నాగార్జున తెలిపారు.

కల్యాణ మండపం మురుగుతో అవస్థలు



కృష్ణానగర్‌లోని ద్రోణంరాజు కల్యాణ మండపం సమీపంలో నిరసన తెలుపుతున్న స్థానికులు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు కృష్ణానగర్‌లోని ద్రోణంరాజు కల్యాణ మండపం, పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, మురుగు నీటితో పరిసరాలు అస్తవ్యస్థంగా తయారవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ మేరకు మహిళలు, వృద్ధులు మంగళవారం నిరసన తెలిపారు. అపరిశుభ్ర వాతావరణం వల్ల దుర్వాసన, దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు వాపోయారు. తరచూ వ్యాధుల బారిన పడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని లక్ష్మి అనే వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ నివాసాలతోపాటు ఓ వృద్ధాశ్రమం కూడా ఉంది. మురుగు నీరు, దోమల ప్రభావం సీనియర్ సిటిజన్స్‌పై తీవ్రంగా పడుతోంది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు, వృద్ధులు కోరుతున్నారు.


కొండపేటలో పగిలిన పైప్‌లైన్



జెడ్పీ హైస్కూల్ రహదారిలో ప్రవహిస్తున్న నీరు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు కొండపేటలో మంగళవారం తాగునీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరు వృథాగా హైస్కూళ్ల రహదారిపై ప్రవహించింది. కొండపేట పంప్‌హౌస్ నుంచి భీమిలికి సరఫరా అయ్యే ఈ పైప్‌లైన్ గతంలో పగిలిన చోటే మళ్లీమళ్లీ పగిలిపోవడంతో దిగువన ఉన్న ఇళ్లలోకి నీరు చేరుతోంది. అంతేకాకుండా ఒక్కోసారి పైప్‌లైన్ ఫౌంటెయిన్‌లా ఎగజిమ్ముతుండడంతో ఈ రహదారిలో రాకపోకలు సాగించే వారు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొండపేట, కార్మికవాడ, గణేష్ థియేటర్ ప్రాంతాల్లో పగిలిన పైప్‌లైన్‌కు ప్రత్యామ్నాయంగా మరొక పైప్‌లైన్ వేయాలని స్థానికులు కోరుతున్నారు.

నూకాలమ్మ దర్శనానికి భారీగా భక్తులు



పూజలు అందుకున్న నూకాలమ్మ అమ్మవారు

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ వారి దర్శనానికి భక్తులు మంగళవారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గత నెల 20వ తేదీ నుంచి 23 వరకు అమ్మవారి ఉత్సవాలు జరిగాయి. తర్వాత వచ్చే మంగళవారం మారువారం కావడంతో గత వారం గతంలో ఎప్పుడూ లేని విధంగా భారీగా భక్తులు తరలివచ్చారు. ఇప్పుడు రెండో వారం కూడా ఎక్కువ మంది భక్తులు దర్శనానికి విచ్చేశారు. కాగా ఆలయం వద్ద భారీ రావిచెట్టు ఉండడం, దాని నీడ అన్నివైపులా పరుచుకుని ఉండడంతో భక్తులు ఎండతో ఇబ్బంది లేకుండా అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా నూకాలమ్మ మహోత్సవం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం, సోమన్నపాలెం, గొల్లలపాలెం, రెడ్డిలపాలెం ప్రాంతాల గ్రామదేవత శ్రీ నూకాలమ్మ అమ్మవారి మహోత్సవాలు మంగళవారం అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

క్లుప్తంగా

అయ్యప్పస్వామి సేవాపీఠంలో ప్రత్యేక పూజలు నేడు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురంలోని శ్రీఅయ్యప్పస్వామి సేవాపీఠంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అయ్యప్పస్వామి జన్మదినం, ఉత్తరా నక్షత్ర పూజ సందర్భంగా పంచామృతాలతో అభిషేకాలు, ఉదయం 8 గంటలకు లక్ష్మీ గణపతి హోమం నిర్వహించనున్నట్టు అర్చకుడు పెంట వెంకటరమణ శర్మ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.

గీతంలో మహిళా టెక్ మేకర్స్ సమావేశం



సమావేశంలో మహిళా ప్రతినిధులు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా వివిధ రంగాలకు చెందిన మహిళా టెక్ మేకర్స్ మంగళవారం సమావేశమయ్యారు. విశాఖతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 350 మంది మహిళా ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. మహిళా టెక్ మేకర్స్ విశాఖ ప్రతినిధి వి.ఉషారమణి మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యం, రొమ్ము క్యాన్సర్, వివిధ రకాల ఒత్తిళ్లను మహిళలు ఎదుర్కొనే విధానాలు, తదితర అంశాలపై ఆమె చర్చించారు. కార్యక్రమంలో జిమ్సర్ ప్రొఫెసర్ ప్రభావతి, స్కూల్ ఆఫ్ ఫిజియోథెరపీ డైరెక్టర్ డా.మాధురి కాశీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ వార్షికోత్సవం రేపు

భీమునిపట్నం: భీమిలి నేరెళ్లవలస కాలనీ ఉగ్రనర్శింహస్వామి ఆలయ సమీపంలోని శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి ప్రత్యేక పూజలతోపాటు ఇతర కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

ఘనంగా పైడితల్లమ్మ అనుపోత్సవం

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద, నారాయణరాజుపేట, దాకమర్రి పంచాయతీలకు చెందిన గ్రామదేవత పైడితల్లమ్మ అనుపోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఈ పంచాయతీల్లోని 14 గ్రామాల ప్రజలు అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాల్లోని ఆలయాల వద్ద పాలధార, రథోత్సవం నిర్వహించారు. బాణసంచా, నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యుద్దీప కాంతులతో ఆలయాలు, గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బుధవారంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

జ్యూట్ కార్మికులకు బకాయిలు చెల్లించాలి



సమావేశంలో కార్మిక సంఘ నాయకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు యజమాని బజోరియా కార్మికులకు ఇంకా బకాయి ఉన్న పీఎఫ్, గ్రాడ్యుటీ వెంటనే చెల్లించాలని అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం కాంగ్రెస్ కార్మిక సంఘ కార్యాలయంలో వారితోపాటు చిట్టివలస లేబర్ యూనియన్, టీఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి మొత్తం కార్మికులకు బకాయిలు చెల్లిస్తామని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జాయింట్ లేబర్ కమిషనర్ రామారావు వద్ద యజమాని అంగీకరించారన్నారు. గడువు పూర్తయినా యాజమాన్యం నుంచి స్పందన కరువయిందన్నారు. మరోమారు ఎమ్మెల్యే, జేసీఎల్ వద్దకు వెళ్లాలని కార్మిక సంఘాల నాయకులు తీర్మానించారు. సమావేశంలో దల్లి అప్పలరెడ్డి, అల్లు బాబూరావు, ఎం.దేవుళ్లు, మునకాల ఆదినారాయణరెడ్డి, కొండపు ఈశ్వరరావు, చిల్ల ఆదినారాయణరెడ్డి, చిల్ల రాంపైడి, ఎస్.ఈశ్వరరావు, నరవ రామారావు, కానూరి రాంబాబు, గొలగాని రాము, గిడిజాల రమణ, ఎం.అప్పలరాజు, తమ్మిన కూర్మారావు పాల్గొన్నారు.

'జగనన్నే మన భవిష్యత్' విజయవంతానికి పిలుపు



సచివాలయ కన్వీనర్లకు కిట్లు అందజేస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 7న ప్రారంభం కానున్న ''జగనన్నే మన భవిష్యత్'' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు కోరారు. వైఎస్సార్ సీపీ మండల కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలుచేయని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నారని కొనియాడారు. నవ రత్నాల పథకం ద్వారా ప్రతీ ఇంటికీ లక్షలాది రూపాయల ఆర్థిక లబ్ధి చేకూరిందన్నారు. జగనన్నతోనే రాష్ట్రానికి మరింత భవిష్యత్ ఉంటుందని ప్రజలకు తెలియజేయాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, నాయకులు సిరుగుడి ఆదినారాయణ, సుంకర బంగారప్పుడు, బోని సన్యాసినాయుడు, ఈర్ల ఈశ్వరరావు, జి.పెదఎర్రినాయుడు, సీర సూరప్పుడు పాల్గొన్నారు.

ఇంటింటికీ కన్వీనర్లు, గృహసారథులు

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వివరించే ''జగనన్నే మన భవిష్యత్'' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బంక సత్యం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలను తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆయా సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, ప్రజల అవసరాలు తెలుసుకోవాలన్నారు. గత ప్రభుత్వం చేసిన మోసాలు వివరించి, వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ నెల 7న కార్యక్రమాన్ని ప్రారంభించి 20వ తేదీలోపు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం సచివాలయ కన్వీనర్లకు ప్రచార సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి గంట్రెడ్డి శ్రీను, పాండ్రంకి శ్రీను, పాండ్రంకి అప్పారావు, బంటుబిల్లి మణిశంకర్‌నాయుడు, డోల దేవుడు, మరుపిళ్ల చిన్నయ్య పాత్రుడు, కోరాడ అప్పలస్వామి నాయుడు, కోరాడ ముసలినాయుడు, లెంక రాంబాబు, చెన్నా సత్యం, రౌతు శ్రీను పాల్గొన్నారు.

ఆసరా సంబరాలు నేడు

పద్మనాభం: మండలంలోని బి.ఆర్.తాళ్లవలసలో బుధవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. ఉదయం పది గంటలకు సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. అనంతరం రేవిడి పీహెచ్‌సీ కార్యాలయాన్ని, మండల విద్యా శాఖ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

భీమునిపట్నం: గొల్లలపాలెం సమీపంలోని సెడార్ పాఠశాల వద్ద ప్రీ ప్రైమరీ పిల్లల పట్టభద్రుల దినోత్సవాన్ని మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల సీఈవో సునీత్‌థామస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పిల్లలకు వినూత్న పద్ధతిలో బోధిస్తున్నామని పేర్కొన్నారు. చిన్నపిల్లలతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిలో ఉత్సాహం, చురుకుదనం పెరిగి చక్కగా చదువుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ కృష్ణానగర్ కాలనీలో గల వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రాంగణంలో సుమారు వంద మంది పేద మహిళలకు మంగళవారం చీరలు పంపిణీ చేశారు. యాంటీ కో స్కాడ్ ఫౌండేషన్, నగరాలు వెల్ఫేర్ సొసైటీ, హ్యాండ్స్ టు హెల్ప్ సంస్థల ఆధ్వర్యంలో వీటిని అందించారు. కార్యక్రమంలో పిళ్లా సత్యనారాయణ, కె.విజయ్ కుమార్, పోతిన అనురాధ, పిళ్లా సూరిబాబు, బైపిల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

తెగుళ్లు సోకి మోడువారుతున్న వేపచెట్లు



శిల్పారామంలో మోడువారిన వేప చెట్లు

పీఎం పాలెం : పంటపొలాల్లోని చీడపీడలకు వేప చెట్టు పేరు చెబితే హడల్. వివిధ తెగుళ్ల నివారణకు, భూసారం కోసం సాగు భూములకు వేప చెట్టు బెరడు, ఆకులు తదితర వాటిని విరివిగా ఉపయోగిస్తారు. వేప కాయల నుంచి నూనె తీసి వినియోగిస్తారు. ఇలా ఈ చెట్టు అనువణువూ ఔషధ గుణాలు కలిగి ఉంటుంది. అలాంటి వేపచెట్లకు తెగుళ్లు సోకడం చూసిన వారు ఆశ్చర్యానికి గురవుతున్నారు. వసంత కాలంలో వేప పువ్వుతో పచ్చని ఆకులతో గుబురుగా ఉండాల్సిన వేపచెట్లు శిల్పారామంలో మోడువారి అస్థిపంజరాల్లా దర్శనమిస్తున్నాయి. శిల్పారామంతోపాటు పరిసర ప్రాంతాల్లోని వందలాది చెట్లు కూడా మోడువారి కలావిహీనంగా మారాయి. ఇదే పరిస్థితి కొనసాగితే వేప చెట్లు కానరాని దుస్థితి ఏర్పడుతుందని ప్రకృతి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వేప చెట్లను పరిరక్షించడానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి వద్ద ప్రస్తావించగా వేపచెట్లకు తెగుళ్లు సోకిన విషయాన్ని వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి సూచనల మేరకు చర్యలు చేపట్టి పూర్వ వైభవం తీసుకురావడానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం




కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శైలజ

మధురవాడ: గర్భిణులు, తల్లీబిడ్డల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ అవసరమని మిథిలాపురి వుడా కాలనీ యూపీహెచ్‌సీ వైద్యుడు ఎమ్.శివ రామకృష్ణ సూచించారు. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్, కిల్కారి వాయిస్, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : గ్రామ స్థాయిలో తల్లీబిడ్డల ఆరోగ్యంపై ఆశా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కోరాడ శైలజ సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో గర్భం దాల్చిన వారి వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. వారు ప్రసవించే వరకు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రసవించిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, తల్లిపాల వల్ల బిడ్డలకు కలిగే ప్రయోజనాలు వివరించి తల్లులను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ కృష్ణవేణి, హెల్త్ సూపర్‌వైజర్లు ఐ.గోవిందరావు, కల్యాణమ్మ, స్వరాజ్యం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బూత్ కమిటీలతో పథకాలపై ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న శివన్నారాయణ

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గ స్థాయిలో బూత్ కమిటీలను బలోపేతం చేయడంతోపాటు, వాటి ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిట్రా శివన్నారాయణ సూచించారు. పార్టీ స్థానిక కార్యాలయంలో శక్తి కేంద్ర ప్రముఖ్‌లు, ఇతర నాయకులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ఆ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ఇందుకోసం అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు మాట్లాడుతూ పార్టీలోని ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేస్తే తప్పక విజయం సాధిస్తామన్నారు. రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ శివమకుటం, ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి కేఎస్‌పీ చక్రవర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్ యాదవ్, వాసుపల్లి శ్రీహరి, కంటుభుక్త సునీత పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



విద్యార్థులతో దివీస్ యాజమాన్య ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం మంగళవారం 64 మంది విద్యార్థులకు రూ.4 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేసింది. చిప్పాడ, అన్నవరం, తూడెం, పెదనాగమయ్యపాలెం, గుడివాడ, లింగాలవలస, చిప్పాడ, మూలకుద్దు, టి.నగరపాలెం పంచాయతీల్లో 8, 9, 10 తరగతులతోపాటు ఇంటర్మీడియట్, డిగ్రీ చదవుతున్న మొదటి ఇద్దరు విద్యార్థులకు వీటిని అందించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, ఎం.ఎస్.ఎన్.రావు, ఏజీఎం ఎస్.బాలాజీ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు ఈ సహకారాన్ని ఉపయోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సామాజిక సేవ అధికారులు ఇ.ఎస్.నాగరాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కసూర్బాలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పద్మనాభం: పద్మనాభంలోని కస్తూర్బా విద్యాలయంలో 2023 – 2024 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని స్పెషలాఫీసర్ గ్రేస్ లిల్లీ తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ప్రథమ ఇంటర్‌లో ఎంపీసీ 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేర నియంత్రణకు సహకరించాలి

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌లో నేరాల నియంత్రణకు బోటు యజమానులు, మత్స్యకారులు సహకరించాలని ఏసీపీ శిరీష అన్నారు. మంగళవారం ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యాలయంలో వాసుపల్లి జానకిరామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. బయటి వ్యక్తులు హార్బర్‌లోకి రాకుండా బోట్ యజమానులు పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ఎంట్రీ పాసులు మంజూరు చేయాలని, వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను ఏసీపీ శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ శిరీషను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి నరసింహులు, క్రైం ఎస్ఐ శ్రీనివాస్, ఎస్ఐ రవి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుంటు దానయ్య, దూడ పోలయ్య, గనగళ్ల రాజేష్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ యర్రంశెట్టి వెంకటరావు, S/o. లేటు ఎల్లయ్య గార్కి కుప్పిలి లేటు అప్పారావు గారి భార్య కుప్పిలి నారాయణమ్మ, ఈమె కుటుంబ సభ్యులు ఏకస్సులై యీ దిగువ షెడ్యూల్ స్థిరాస్తిని **జనరల్ పవర్ అటార్నీ** వ్రాయించి ఇవ్వడమైనది. సదరు ఆస్తిపై భీమునిపట్నం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో O.S.No. 162/2021, I.A. No. 336/2021 కేసులు వున్నవి. **జనరల్ పవర్ అటార్నీ ఆస్తి వివరం: విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం జోన్ GVMC పరిధి కుమ్మరిపాలెం వలంద భూములు గ్రామంలో గల జిరాయతీ మెట్టు భూమి పట్టా నెం. 72కు, సర్వే నెం. 1/3లో గల య. 7.00 సెంట్లు లేక 2.800 హెక్టార్లు భూమికి హద్దులు: ఉత్తరం: రోడ్, దక్షిణం: గనగళ్ళ కృష్ణమూర్తి గారి జిరాయతీ మెట్టు, తూర్పు: కందుకూరి శివానంద మూర్తి గారి ఆశ్రమం, పడమర: సంగివలస గ్రామ సరిహద్దు.**

సదరు కుప్పిలి నారాయణమ్మ గాని, ఈమె కుటుంబ సభ్యులు గాని, దాయాదులు గాని, వారసులు గాని, ఒకరికి తెలియకుండగా మరొకరు సదరు ఆస్తిపై వేరొకరికి తనఖాలు గాని, హామీలు గాని, జప్తులు గాని, కోర్ట్ ఛార్జీలు గాని, క్రయ పురోణీలు గాని చేసిననూ అవి ఎంత మాత్రము చెల్లనేరవు అని, అటుల గాక అవి చేసినను లేదా ఇతరులు అట్టివి చేసుకొన్ననూ ఎంత మాత్రము చెల్లనేరవు అని ఇందుమూలంగా తెలియజేయడమైనది. అట్లు చేసిన యెడల నా క్లయింట్స్ వారిపై తీసుకోబోవు సివిల్, క్రిమినల్ చర్యలకు పూర్తి బాధ్యులు కాగలరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

G.TRINADHA RAO, Advocate
D.No. 13-8-32, Colla Street, Bheemunipatnam, Visakhapatnam Dist. Cell: 9291476412